# Eenadu

# ఉద్యోగులు 71వేల మంది!

ఈనాడు – హైదరాబాద్

తెలంగాణలో ఉద్యోగ సంఘాలు కోరుతున్నట్లుగా కొత్త జిల్లా కేంద్రాల్లో నియామకాలు చేపట్టాలంటే 71వేల మంది కొత్త ఉద్యోగులు అవసరమవుతారు. ప్రస్తుత జిల్లా కేంద్రాల్లో ఉన్నవారిలో కొందరిని విభజించటం, సారూప్య విభాగాలను ఏకం చేయటం వంటి చర్యల ద్వారానైతే కొత్తవారు 25 వేల మందికి పైగానే అవసరమని అంచనా. వివిధ ఉద్యోగ సంఘాల వినతుల దృష్ట్యా కొత్త జిల్లా కేంద్రాల్లోని ఉద్యోగులపై కార్యదళం(టాస్క్‌ఫోర్సు) తగిన సిఫార్సులు చేయనుంది.

రాష్ట్రంలో ప్రస్తుతం ఒక్కో జిల్లా కేంద్రంలో ఉద్యోగుల సంఖ్య ఒక్కోలా ఉంది. మొత్తం పది జిల్లాల్లోను 41,816 మంది విధులను నిర్వహిస్తున్నారు. ఒక్కో జిల్లాలోని ఉద్యోగుల సంఖ్య సగటున 4,181. దీనికి ఖాళీలు అదనం. ప్రస్తుతం ఒక్కో జిల్లా కేంద్రంలోను ఎంతమందైతే ఉద్యోగులు పనిచేస్తున్నారో అంతే మందిని కొత్త జిల్లా కేంద్రాల్లోను నియమించినప్పుడే కొత్త జిల్లాల ఏర్పాటు లక్ష్యం నెరవేరుతుందని వివిధ ఉద్యోగ సంఘాలు ఇప్పటికే ప్రభుత్వానికి వినతులను సమర్పించాయి. వీటి ప్రకారమైతే కొత్తగా ఏర్పాటయ్యే 17 జిల్లా కేంద్రాల్లోను కలిపి 71,077 మంది కొత్త ఉద్యోగులు అవసరమవుతారు. ఇలా అందరినీ కొత్తవారిని కాకుండా ప్రస్తుత జిల్లా కేంద్రాల్లోని కొందరిని కొత్త జిల్లాలకు పంపటం, సారూప్య శాఖలను విలీనంచేసి మిగులు సిబ్బందిని సర్దుబాటు చేయటం వంటి చర్యలను కార్యదళం అనుసరించబోతోంది. అయినా కొత్తవారు 25వేల మందికి పైనే అవసరమవుతారనేది ఉద్యోగసంఘాల ప్రతినిధుల అంచనా.

## వరంగల్‌లో అధికం

ప్రస్తుత పది జిల్లా కేంద్రాలను పరిశీలిస్తే వరంగల్‌లో అత్యధికంగా 6,001 మంది ఉద్యోగులు విధులను నిర్వహిస్తున్నారు. కొన్ని శాఖల ప్రాంతీయ కార్యాలయాలు అక్కడ ఉన్నందునే వీరి సంఖ్య మిగతా వాటికంటే ఎక్కువ. పోలీసు బలగాలను పక్కనపెడితే రంగారెడ్డి జిల్లా కేంద్రం(హైదరాబాద్)లోని ఉద్యోగులు మిగతా జిల్లాల కేంద్రాల వారికంటే బాగా తక్కువగా 1,929 మందే ఉన్నారు. అవసరాన్ని బట్టి కొత్తవారిని నియమించుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ఆదేశాలతో అధికారులు తదనుగుణంగా అంచనాలుకడుతున్నారు.

**ప్రస్తుతం ఏ జిల్లా కేంద్రంలో ఎంతమంది ఉద్యోగులు**

| జిల్లా | ఉద్యోగుల సంఖ్య |
|---|---|
| వరంగల్ | 6,001 |
| కరీంనగర్ | 4,791 |
| ఖమ్మం | 4,586 |
| హైదరాబాద్ | 4,513 |
| మహబూబ్‌నగర్ | 4,323 |
| ఆదిలాబాద్ | 4,303 |
| నల్గొండ | 4,194 |
| మెదక్ | 3,869 |
| నిజామాబాద్ | 3,307 |
| రంగారెడ్డి | 1,929 |
| మొత్తం | 41,816 |

## తగిన సంఖ్యలో ఉద్యోగులుంటేనే సత్ఫలితాలు

ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏళ్లు అవుతోంది. పలు పథకాలను అమలుచేస్తోంది. ఇవన్నీ కొత్త జిల్లాల్లోనూ సత్ఫలితాలు ఇవ్వాలంటే జిల్లా కేంద్రాల్లో తగిన సంఖ్యలో ఉద్యోగులుండాలి. అందువల్లనే ప్రస్తుత జిల్లా కేంద్రంలో మాదిరిగానే కొత్త జిల్లా కేంద్రంలోనూ ఉద్యోగులు అవసరమని ప్రభుత్వాన్ని కోరాం. మిగతా సంఘాలూ మాతో ఏకీభవించాయి.

- దేవీ ప్రసాద్, గౌరవ అధ్యక్షులు,
రాష్ట్ర టీఎన్జీవోల సంఘం

## కొన్ని శాఖల్లో సర్దుబాట్లు చేయవచ్చు

కొన్ని శాఖల్లో హోదాల మార్పు వంటి చర్యల ద్వారా ఇపుడున్న ఉద్యోగులను జిల్లా కేంద్రాలకు సర్దుబాటు చేయవచ్చు. ఖజానా శాఖనే తీసుకొంటే జిల్లాకు అధిపతిగా ఉన్న డిప్యూటీ డైరెక్టర్ హోదాను గతంలోలా జిల్లా ఖజానా అధికారి అని మార్చి ప్రస్తుత సిబ్బందిని కొత్తవాటికి నియమించవచ్చు. ఇలా మిగతా శాఖల్లోను చేయవచ్చు.

- జి.వెంకటరెడ్డి, అధ్యక్షులు,
ఖజానా గజిటెడ్ అధికారుల సంఘం